స్కెచ్

# కుందేటికొమ్ము

"శ్రీవిరించి"

ఎప్పుడో అయిదోక్లాసులో చదువుకున్నాం కలిసి. ఇప్పుడు యెవరేం చేస్తున్నామో ఒకళ్ళనడిగి ఒకళ్ళం తెలుసుకుంటేగాని తెలీదు.

ఇందులో నా ప్రమేయం యేమీలేదు. అలవాటుప్రకారం సిమెంటురోడ్డుమీద ఓ వారగా వెళుతున్నాను, బుర్ర వంచుకుని-యేవేవో ఆలోచించుకొంటూ, మర్చిపోయిన అమూల్య విషయాలు నెమరుకు తెచ్చుకుంటూ. వెనకనించి ఎవరిదో చెయ్యివచ్చి మీదపడింది. ఎవరేనా పొరపాటున పరధ్యానంలో వేసుకుంటారేమోనని అంత పట్టింపుగా వెనక్కి తిరిగి చూళ్ళేదు-ఎంతసేపటికీ చెయ్యి విడదు. బలవంతాన వెనక్కి తిర్గా యెన్నడో ఎరిగిన ముఖం. కాని గుర్తు రాదు-తెలీదు యెవరయిందీని.

నా సందిగ్ధం గ్రహించాడు. వెంటనే అన్నాడు; "అవున్లే మర్చిపోయుంటావు. ఇప్పటిమాటా మరి? పన్నెండేళ్ళయింది మనం విడిపోయి. నాకంటే ఆదేపని గనక-నిన్ను ఇట్టే గుర్తుపట్టాను-ఏమీ అనుకోన్లే పద!"

గుర్తురాదు; కాని మెకానికల్‌గా ఆ మనిషి తీసుకెళ్ళినట్టే నడిచాను. మనస్సులో ఒకటే బెంగ; గుర్తు రాదేమో అని కోపం, అవతలి మనిషి యేమనుకుంటాడోనని భయం, కాని లాభంలేదు.

కాఫీ తాగబోతూ అతనే అన్నాడు: "ఇంకా గుర్తు రాలేదు కదూ? చెప్పెయ్యనా? లేక ఇంకా టైం యివ్వమంటావా?"

ఏమనేందుకూ తోచదు. చొరవచేసుకు మాట్లాడే స్నేహితుడి పేరు గుర్తు రానందుకు సిగ్గు. నీరసంగా నవ్వాను.

"సుబ్బారావుని" అన్నాడు.

ఎవరు సుబ్బారావు? ఎంతమంది లేరు సుబ్బారావులు? కో అంటే కోటిమంది సుబ్బారావులు పలికే యీ ఆంధ్రదేశంలో ఈ సుబ్బారావు ఎవరని "అయిడెంటిఫై" చెయ్యను? గుర్తున్నంతమేరకూ సుబ్బారావులంతా మనసులో మెదిలారు. మాయింటి సొంతదారుడూ ఖాతాకొట్టు ఆసామీ, అవతలవీధిలో ఎవరినో లేవదీసుకు వొచ్చి కాపురం వుంటున్న పెద్దమనిషీ, విజయనగరంలో స్కూలుమాష్టరు ఉద్యోగంచేస్తూ అకస్మాత్తుగా గుండె ఆగి చనిపోయిన పుణ్యపురుషుడూ, మాబావమరిది పింతల్లి నాలుగోకొడుకూ-ఊహు లాభంలేదు. ఈ మనిషి ఆ మనుష్యుల్లో వాడు కాదు.

కోపం వస్తుందేమో అనుకున్నాను, శాపం పెడతాడన్న భయం లేదుగాని ఎదుటివాడికి క్షుద్రలక్షణాలు యేర్పడేందుకు కారణం ఎందుకవాలని, నవ్వుతూనే వున్నాడు యింతసేపూ. ఆ నవ్వు నా అజ్ఞానానికి పరిహాసంగా కాదనుకుంటాను. కేవలం తమాషాగా.

అసహాయస్థితి గ్రహించాడు. పాపం అనుకున్నాడు కాబోలు, ముందడుగు వేశాడు! "ఒక్కటే యేడాది. ఇద్దరం కలిసిమెలిసి తిరుగుతూ ఐదో క్లాసు చదివేవాళ్ళం. మనిద్దరి స్నేహానికీ ఎందరో అసూయ!"

ఇంకా చెప్పక్కర్లేదు, సుబ్బారావు గుర్తుకు వచ్చాడు. కాని ఎందుకింతసేపూ గుర్తుకు రాలేదు? జరిగిపోయిన సంగతుల్ని గురించి ఒకటే గుంజాటన. ఎట్లా గుర్తుంటుంది? ఎన్నాళ్లు బతుకుతామో తెలీనివాళ్ళం; బ్రతికే నాలుగురోజులైనా యే నీడని వుంటామో తెలీనివాళ్ళం, ముందు క్షణం యేం మూడుతుందో తెలుసుకోలేనివాళ్ళం, ఆత్మతృప్తికోసం ఊరికే అంచనాలు వేసుకునేవాళ్ళం, మనం యేం చెయ్యగలం? ఎన్నని గుర్తు పెట్టుకోగలం? జీవితంలో అనేక విషయాలకు సామ్యాలు, పోలికలు, భ్రమని కలిగించేందుకు?

కాని సంతోషించాను. అయిదో క్లాసులోని నా మిత్రుడు నన్నీస్థితిలో గుర్తు పట్టగలిగినందుకు

నేను గుర్తు పట్టలేకపోవటం శోచనీయమే ఐనా గర్వపడుతున్నాను.

సుబ్బారావు ముభావికాడు. తల్చుకున్నదంతా నాలుగుముక్కల్లో దబదబా వాగేస్తాడు. "ఏమిటీవాలకం? ఇక్కడ యెన్నాళ్ళబట్టీ వుంటున్నావు? ఏం చేస్తున్నావు?..."ఇట్లానే బాహ్య జీవితానికి సంబంధించిన ఆముష్మిక ప్రశ్నలు యెన్నో వేశాడు. జవాబుకోసం నన్ను నేనే ఒకసారి పరికించుకున్నాను. చొక్కా బాగానే వుందనిపిస్తోంది. పోతే కొద్దిగా నలిగిపోయింది. జుట్టు రేగివుండటం తథ్యం. విసుగుతోనూ ఆలోచనలతోనూ ముఖం గంభీరమై కొత్తగా చూచేవాడికి కోపం వచ్చేట్టు ఉండొచ్చును. ముఖాన్ని బట్టి భావాలు చదువుతారా? చదవగలరా యెవరైనా? అట్లాగయితే హృదయాలు విప్పి చదవొచ్చుగా!

"జవాబు చెప్పవేం? ఏం చేస్తున్నావు?"

చెప్పాను. నిర్జీవంగా చెప్పాను. సుబ్బారావు పులకరించాడు. నేనింత ఘనపదవిని అధిష్ఠించినందుకు కంగ్రాచ్యులేషన్స్ చెబుతూపోతున్నాడు. కాని నాబాధ, అంతర్వాణి సంఘర్షణ సుబ్బారావుకి ఎందు కర్థంకాదు? కనీసం యెందుకతను ఊహించలేడు?

ఇంటికి తీసుకొచ్చాను. అడక్కముందే చెప్పేశాడు తనకిపెళ్ళయిందనీ ఇద్దరు పిల్లలనీ కుటుంబం అక్కడే వుందనీ. తను మాత్రమే వొచ్చాట్ట. ఉద్యోగంలో చేరాక సెలవు చూచుకుని తీసుకొస్తాట్ట. మంచియిల్లు కావాలన్నాడు. నువ్వే చూచి పెట్టాలన్నాడు. మౌనం పూర్ణాంగీకారంగానే స్వీకరిస్తాడు పాపం, తనకోసం నేనో ఇల్లు చూచిపెడతాననీ యిక తనకే బెడదా అక్కర్లేదనీ సుబ్బారావు అనుకుంటూంటాడు.

సుబ్బారావు నాకుయేమిటి? అట్లా అనుకుంటే యీ ప్రపంచంలో యెవరూ యెవరికీ యేమిటీ కారు. ఒకళ్ళ ఒకళ్ళకీ మధ్య అనుబంధాలు వుండితీరాలి, సంబంధాలు పెరగాలి, మమకారాలు యేర్పడాలి. అప్పుడే జీవితంలో ఆనందం, ఆ మమకారం కీలు సడలితే జీవితంలో వైరాగ్య దృశ్యం—అంతా అనుకుంటున్నాను మనసులోనే ఏదీ సుబ్బారావుతో పైకి అనే ధైర్యం చాలదు. బాల్యమిత్రుడు అనుకోవచ్చా సుబ్బారావుని? తప్పులేదు. అంతకన్నా యింకేదో యెక్కువని అనిపిస్తుంది.

నేనింతవరకూ చదివిన తరగతుల్లో యెంతమంది మిత్రుల్లేరు? వాళ్ళందరిలోకీ సుబ్బారావుని నేనెక్కువగా ప్రేమిస్తున్నానా? ఎప్పుడో అయిదో క్లాసులో చదువుకున్నాం కలిసి, మధ్యలో మరిచేపోయాను. అతను గుర్తుచేస్తేనే తప్ప నెమరుకు రాని నీరసస్థితిలోవున్నాను. తీరా తెలిసాక సుబ్బారావంటే యెందు కింత ఆప్యాయం నాకు? నాకు ప్రాణంలో ప్రాణమా సుబ్బారావు?

"యేవిషయాలూ మాట్లాడవేం? చెప్పేందుకు యేమీ సంగతులు లేనే లేవా యిన్నేళ్ళలోనూ? అంత గంభీరంగా యెందుకుంటావు?"...సుబ్బారావు. యివేం ప్రశ్నలు? ఏదో తరగతి కుర్రాడు అడగాల్సిన ప్రశ్నలు వేస్తున్నాడు.

సుబ్బారావు ఊరికి వెళ్ళిన మూడురోజులూ నాకేం తోచదు, ఏమిటో వెలితి. హృదయం మరెక్కడో వున్నట్టూ, విగ్రహం మాత్రం యిక్కడ వున్నట్టూ, సంవత్సరాల తరబడి - మర్చిపోయాం కనక ఒకళ్ళ ప్రసక్తి ఒకళ్ళం లేకుండా గడప గలిగాం. తీరా మళ్ళీ కలుసుకున్నాక ఒకక్షణం విడిపడితే యేమిటో బెంగ, ఈ హృదయాలు ఎంత లోతో తెలీదు. ఆకాశం యెంత యెత్తో యెవరికి తెలుసు ?

'నా యింటిమాట యేంచేశావ్?' అంటాడు సుబ్బారావు, ఇంకా భేదాలు. 'నువ్వొకటీ నేనొకటీ కాదు. నువ్వే నేనయినప్పుడు, నా యిల్లూ నీ యిల్లే; ఈ యిల్లే మనది-వేరే చర్చ యెందుకూ?' అన్నాను.

ఒప్పుకోడు తేలిగ్గా, ఏమిటో అందుకు ప్రతికూలంగా చెబుతాడు, 'నాకు మనశ్శాంతివుండాలంటే నువ్వీ పనిచేసి తీరాలి' అంటే యిక నోరు మెదపలేదు.

నిజదార సుతులతో సుబ్బారావు నా యింటోనే కాపురం చెయ్యాలని నేనెందుకోరుకోవాలి? మనసులొకటైనా మనుషులు ఒకటౌతారా? ఇంకా ఆ నూతన ప్రపంచంలోకి మనం వెళ్ళలేదుగా అనిపిస్తుంది.

జరిగిందానికి కారణాలు చెప్పగలం కాని జరగబోయే సంగతులు చెప్పలేం మనం!—ఈ మాట అనుకుంటే గాని ఆత్మతృప్తి ఉండదు.